క్లుప్తంగా

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

తిర్యాణి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవడానికి పుస్తక పఠనం ఎంతగానో ఉపయోగపడుతుందని గంభీరావుపేట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అనూష అన్నారు. శనివారం పాఠశాలలో రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దొందేరావు, మాధురి, సునీత, అనిషా భాను, రూం టూ రీడ్ సంస్థ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌చారి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు స్వచ్ఛత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెచ్‌ఎం గావుడే హన్మంతు అన్నారు. స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని గుండాయిపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పద్య పోటీలు, పెయింటింగ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

పరామర్శ



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కెరమెరి: మండలంలోని చొపన్‌గూడ గ్రామానికి చెందిన ఉయిక భీంరావు, సుర్దాపూర్ గ్రామానికి చెందిన మడావి ఆనంద్‌రావులు శనివారం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకులు అజ్మీరా శ్యాంనాయక్, రాథోడ్ శేషారావులు పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

కెరమెరి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మడావి ఆనంద్‌రావు(40) నిత్యం మద్యం సేవిస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం తాగి వచ్చిన ఆయనను భార్య సంతుబాయి మందలించింది. దీంతో క్షణికావేశంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

అనారోగ్యంతో ఒకరు మృతి..
మండలంలోని చొపన్‌గూడ గ్రామానికి చెందిన ఉయిక భీంరావు(47) అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కొంతకాలంగా లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న భీంరావు సిర్పూర్(యూ) మండలం చిత్తకర్ర గ్రామంలో అక్క గులాబిబాయి వద్ద ఉంటున్నాడు. శుక్రవారం వ్యాధి తీవ్రత అధికమై మృతి చెందగా శనివారం చొపన్‌గూడకు తీసుకొచ్చి అంత్యక్రియలు చేశారు. మృతుడికి భార్య శశికళ, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కాగజ్‌నగర్‌టౌన్: వినయ్ గార్డెన్స్‌లో శనివారం వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఆట, పాటలతో విద్యార్థులు సందడి చేశారు. ప్రిన్సిపాల్ హనోక్, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు ఆసిఫాబాద్ విద్యార్థిని

ఆసిఫాబాద్: రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు జిల్లా కేంద్రానికి చెందిన సరస్వతి శిశుమందిర్ 6వ తరగతి విద్యార్థిని గుత్తి వెంకటరత్న ఎంపికయ్యారు. బాలవర్గ గణిత ప్రదర్శన, క్రమ బహుభుజాల లక్షణాలు అంశంలో ప్రథమ బహుమతి సాధించింది. సరస్వతీ విద్యాపీఠం మంచిర్యాల విభాగ్ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో నిర్వహించిన విజ్ఞాన మేళ కార్యక్రమంలో ఆసిఫాబాద్ సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు పాల్గొని ద్వితీయ స్థానం సాధించారు. రాష్ట్ర స్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైన గుత్తి వెంకటరత్న ఈ నెల 12,13,14 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తిలో జరుగు ప్రాంత స్థాయి విజ్ఞానమేళా పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు తెలిపారు.









చింతలమానెపల్లి: దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న శివపెల్లి జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. అందమైన పచ్చిక మైదానాలు, రాతి గుట్టలు, పారుతున్న సెలయేరు కనులవిందు చేస్తున్నాయి. మండలంలోని గూడెం గ్రామ పంచాయతీ కేంద్రం నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. కొండ ప్రాంతంలోని రాళ్ల నుంచి వచ్చే సహజ ఊటలతో నిత్యం నీరు పారుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో రెండు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నారు.

పిడుగు పడి దెబ్బతిన్న ఇన్స్‌లేటర్లు

రెబ్బెన: మండలంలోని చిలుకమర్రిగూడ సమీపంలో శనివారం రాత్రి పిడుగుపడి బెల్లంపల్లి నుంచి నంబాల సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా చేసే కరెంట్ స్తంభాలపై ఉండే ఇన్స్‌లేటర్లు దెబ్బతిన్నాయి. రాత్రి సమయంలో ఉరుములతో కూడిన వర్షంతో పాటు ఒక్కసారిగా పిడుగు పడటంతో 15 విద్యుత్ స్తంభాలపై ఉన్న 15 ఇన్స్‌లేటర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో నంబాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. సకాలంలో స్పందించిన ఏఈ ఇమ్రాన్ తమ సిబ్బందితో కలిసి లైన్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. దెబ్బతిన్న ఇన్స్‌లేటర్లను తొలగించి కొత్త వాటిని బిగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

కురిసిన వర్షం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఇప్పటి వరకు ఉక్కపోతతో సతమతమవుతున్న జిల్లా వాసులకు కాస్త ఉపశమనం లభించింది. కాగా కురిసిన వర్షానికి కొంతసేపు జనజీవనం స్తంభించిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఉద్యమం.. ఉధృతం!



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

- ఆందోళన బాటలో సమగ్రశిక్ష ఉద్యోగులు
- ఆరు రోజులుగా తెరుచుకోని ఎమ్మార్సీలు
- మలిదశ ఉద్యమానికి సంఘాల నిర్ణయం

కెరమెరి: సమగ్రశిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు డిమాండ్లు నెరవేర్చాలని చేపట్టిన నిరసనలు కొనసాగించాలని నిర్ణయించారు. ఈమేరకు సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు జిల్లా విద్యాధికారి, పోలీస్ అధికారులకు సమాచారమిచ్చారు. సమగ్రశిక్షలో ఉన్న సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, డీపీవో స్టాఫ్, కేజీబీవీ, సీఆర్టీలు, సీసీవోలు, ఐఈఆర్పీలు, పీటీఐ, అకౌంటెంట్లు, మెసెంజర్లు, స్కావెంజర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ మొత్తంగా జిల్లాలోని 502 మంది ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి ఆందోళనలు కొనసాగిస్తున్నారు.

ఎమ్మార్సీలకు తాళం..
సిబ్బంది నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ఎమ్మార్సీలు కొద్దిరోజులుగా తెరుచుకోవడంలేదు. ఎమ్మార్సీలో విధులు నిర్వహించే ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సీసీవోలు, మెసెంజర్లు నిరసనల్లో పాల్గొనడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

ఉపాధ్యాయ బదిలీల హడావుడి
ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపడుతున్న దృష్ట్యా సంబంధిత పనులు వేగవంతం చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. క్యాడర్ స్ట్రెంత్ పర్టిక్యులర్స్, టీచర్స్ డాటా, టీచర్స్ లాంగ్ స్టాండింగ్, ప్రిపరేషన్ ఆఫ్ టీచర్స్ ఎస్‌ఏ, ఎస్జీటీ లాంగ్ స్టాండింగ్ టీచర్స్ డాటా, పదవీ విరమణ పొందాల్సిన ఉపాధ్యాయుల జాబితా తదితర వివరాలు పంపించాల్సి ఉంది. కానీ.. ఎంఐసీ, సీసీవోలు లేక ఇబ్బందులు తప్పడంలేదు. కాగా, సమస్యలు పరిష్కరించేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని ఎస్ఎస్‌ఏ ఉద్యోగులు చెబుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నాం. కుటుంబ పోషణకు ఇబ్బందులెదుర్కొంటున్నాం. రాష్ట్రస్థాయి అధికారులు మా శ్రమను గుర్తించడం లేదు. వివక్ష చూపకుండా వెంటనే క్రమబద్ధీకరించాలి.

– పి.విజయలక్ష్మి, ఎస్ఎస్‌ఏ సంఘం జిల్లా అధ్యక్షురాలు

ఆందోళనలు ఆపేది లేదు



ఎస్ఎస్‌ఏలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చే దాకా ఆందోళనలు ఆపేది లేదు. చాలీచాలని వేతనాలతో సరిపెట్టి ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోంది.

– పవార్ తుకారాం, ఎస్ఎస్‌ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

స్పోర్ట్స్ పాఠశాలకు రెబ్బెన విద్యార్థుల ఎంపిక

రెబ్బెన: మండలంలోని వంకులం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జాడి ప్రభాకర్ తెలిపారు. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బోర్కుటే నిహారిక, 4వ తరగతి చదువుతున్న వగాడే తేజశ్రీలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎవులే ప్రకాశ్, ఉపాధ్యాయులు అభినందించారు.



స్పోర్ట్స్ పాఠశాలకు ఎంపికైన నిహారిక, తేజశ్రీ

ప్రగతి నివేదిక పుస్తకాలు పంపిణీ

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్పంచులకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రగతి నివేదిక పుస్తకాలను ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. సర్పంచులు అహల్యాదేవి, పోషమల్లు, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా, ఉప సర్పంచులు రవీందర్, మహేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

శివాజీ మహరాజ్ భవనానికి వసతులు కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని శివాజీ మహరాజ్ భవనానికి వసతులు కల్పించాలని శనివారం ఆరె సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు తన క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం మాట్లాడుతూ శివాజీ భవనానికి ఆర్థిక వనరులు లేక పనులు పెండింగ్‌లో ఉన్నాయని, భవనానికి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు ఇతర కనీస వసతులు కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి భవనానికి కాంపౌండ్, టాయిలెట్స్, కిచెన్‌షెడ్ పనుల కోసం నిధులు మంజూరు చేస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు. నాయకులు దాదారాం, బిక్కాజి, నానాజి, మారుతి, రమేశ్, రవీందర్, సంతోష్‌కుమార్, శ్యాంరావ్, రాజు, వెంకన్న, కిషన్, పెంటు, శ్రీహరి, గణపతి ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆరె సంఘం నాయకులు

ఎమ్మెల్యేకు రాఖీ కట్టి నిరసన

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం సమగ్రశిక్ష ఉద్యోగులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు రాఖీ కట్టి నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సంఘం కోశాధికారి నగేశ్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేష్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న ఉద్యోగులు

‘ఆశాల సమస్యలు పరిష్కరించండి’

ఆసిఫాబాద్‌అర్బన్: ఆశల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలని కోరుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆశ వర్కర్లు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ.26,000 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, నాయకులు శ్రీకాంత్, అర్చన, సవీన, భారతి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

‘ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సిద్ధం కావాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: ఈ నెల 18 నుంచి 22 వరకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందువల్ల ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావ్ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు నేడు జిల్లా కేంద్రంలో అత్యవసర సమావేశం, 4, 5 తేదీల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు, అన్నిరాజకీయ పక్షాల నేతలకు వినతిపత్రాలు, 6న రౌండ్ టేబుల్ సమావేశాలు, 7న కలెక్టరేట్ ఎదుట, 8 న నియోజకవర్గాల కేంద్రాల్లో, 9 నుంచి 22 వరకు మండల కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టాలని కోరారు. 18 న ఢిల్లీలో మాదిగ ఉద్యోగుల మహాధర్నా, 19న మాదిగ మేధావులు, విద్యావంతుల మహాధర్నా, 20న ఢిల్లీలో మాదిగ కళామండలి, 21న మాదిగ జర్నలిస్టుల ధర్నా, 22 న లాయర్ల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే సమావేశంలో జిల్లా కమిటీలను వేయనున్నట్లు తెలిపారు.

మోటార్‌బైక్‌పై నాగుపాము హల్‌చల్



పామును కర్రతో హతమార్చుతున్న వ్యక్తి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ ప్రాంతంలో శనివారం సాయంత్రం మోటార్‌బైక్‌పై నాగుపాము హల్‌చల్ చేసింది. బైక్ సీటు కింద దర్శనమిచ్చిన పామును చూసి ప్రజలు భయాందోళన చెందారు. కొంత సేపటి తర్వాత పాము బయటకు రాగా స్థానికులు కర్రతో హతమార్చారు.

కొనసాగుతున్న 2వ ఏఎన్‌ఎంల సమ్మె



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: 2వ ఏఎన్‌ఎంలు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 18వ రోజుకు చేరింది. ఏఐటీయూసీ నాయకులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్, ఉపేందర్‌లు మాట్లాడుతూ సమ్మె మానుకోవాలని 2వ ఏఎన్‌ఎంలపై అధికారులు ఒత్తిళ్లు తేవడం సరికాదన్నారు. సంఘం రాష్ట్ర నాయకురాలు వసంత, ఉపాధ్యక్షులు కమల, నాయకులు లక్ష్మి, పుష్పలత, రాణి, రాధ పాల్గొన్నారు.

ఓటరు జాబితా సరి చూసుకోవాలి

పెంచికల్‌పేట్: ఓటర్లు ఓటరు జాబితాను సరి చూసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని పోతెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఓటరు జాబితా ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితా ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో సవరణలు ఉంటే వెంటనే బీఎల్‌వోల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కౌటాల: అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ వొజ్జల మానిక్ అన్నారు. ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ లిస్టును ప్రదర్శించారు. ముత్తంపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సైతం ఓటర్ లిస్టును ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ముత్తంపేట్ సర్పంచ్ ఆదే శ్రీనివాస్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: ఓటరు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని డీటీ పోచయ్యతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. శిబిరంలో ఫాం 6 ద్వారా 50 మంది కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోగా, సవరణకు 10 దరఖాస్తులు వచ్చాయని, ఫాం -7కు 10 దరఖాస్తులు వచ్చినట్లు బీఎల్‌వోలు తెలిపారు. బీఎల్‌వోలు వనిత, సరోజ, ఎగ్బాల్ భాను, లలితాదేవి, మంజుల, గీత, దేవమ్మ, భాగ్యలక్ష్మి, చంచులక్ష్మి, సులోచన, లక్ష్మి పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: మాట్లాడుతున్న తహసీల్దార్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్‌పై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పనితీరు, విద్యా నాణ్యతను పరిశీలించి గుర్తింపునిచ్చే న్యాక్ గుర్తింపు విధి విధానాలపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. ఆయన మాట్లాడుతూ న్యాక్ గుర్తింపు కోసం ప్రతీ అధ్యాపకుడు కృషి చేయాలని, న్యాక్ గుర్తింపు పొందితే కళాశాలకు అదనపు సౌకర్యాలతో పాటు స్వయం ప్రతిపత్తి హోదా లభించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఉన్నతి శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్: అభ్యాస సామర్థ్యాలు సాధించేందుకు 6 నుంచి 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులకు శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల, జన్కాపూర్ పాఠశాలలో రెండోవిడత ఉన్నతి శిక్షణ కార్యక్రమం ప్రారంభించినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఆసిఫాబాద్‌లో గణితం, సైన్స్, సోషల్, కాగజ్‌నగర్‌లో హిందీ, ఇంగ్లిష్, తెలుగు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారం పంపిణీ

జైనూర్: తెలంగాణ ప్రభుత్వం కిశోర బాలికల్లో రక్తహీనత నివారించేందుకు కిశోర బాలికలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరమ్మ ఆధ్వర్యంలో బాలామృతం పంపిణీ చేశారు. ఏపీఎం సుజాత, సూపర్‌వైజర్ పెంటుబాయి, అజ్జులాలా ఉన్నారు.

వలస వాదులకు టికెట్ ఇస్తే సహించేది లేదు

జైనూర్: ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను వలస గిరిజనులకు ఇస్తే సహించేది లేదని ఆదివాసీ సంఘం నాయకుడు మండాడి లింగు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న సీనియర్ నాయకురాలు మర్సుకోల సరస్వతికే కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకుడు లింగు